క్లుప్తంగా

ఉమ్మడి పౌరస్మృతిపై పునరాలోచన చేయాలి

లక్ష్మీపురం: ఉమ్మడి పౌరస్మృతిపై కేంద్ర ప్రభుత్వం పునరాలోచన చేయాలని ముస్లిం యునైటెడ్ ఫ్రంట్, ముస్లిం జేఏసీ నాయకులు మహమ్మద్ కలీం కోరారు. స్థానిక ముస్లిం జేఏసీ కార్యాలయంలో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. రాజ్యాంగం ప్రకారం ప్రయత్నించటం తప్పు కాదు కానీ బలవంతం, ఎంతవరకు సమంజసమని పేర్కొన్నారు. మైనార్టీలలో మెజార్టీ వర్గంగా ఉన్న ముస్లిం సమాజానికి కేంద్ర మంత్రివర్గంలో స్థానం లేకపోవడంపై మోదీ ప్రభుత్వం ఆలోచన చేయాలన్నారు.

నేడు కార్పొరేషన్ కౌన్సిల్ సమావేశం

నెహ్రూనగర్: గుంటూరు నగరపాలక సంస్థ సాధారణ కౌన్సిల్ సమావేశం శనివారం కౌన్సిల్ హాల్‌లో నిర్వహించనున్నట్లు కమిషనర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి నగర మేయర్ కావటి మనోహర్ నాయుడు అధ్యక్షత వహించనున్నట్లు పేర్కొన్నారు. 238 సభ్యుల ప్రశ్నలు, ప్రతిపాదనలు, ప్రియాంబుల్స్‌తో కౌన్సిల్ సమావేశం ఉదయం 10.30 గంటలకు ప్రారంభం కానుందని చెప్పారు.

అవోపా ఆధ్వర్యంలో గోసేవ

గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరువారి తోటలోని రాధాకృష్ణ గోశాలలో శ్రావణ శుక్రవారం సందర్భంగా ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్(అవోపా) ఆధ్వర్యంలో గోసేవ, గోపూజ నిర్వహించారు. అనంతరం మహిళలు మహాలక్ష్మీదేవికి పూజలు నిర్వహించారు. సభ్యులకు గోవు ఉత్పత్తులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో అవోపా గుంటూరు శాఖ అధ్యక్షుడు కేవీ బ్రహ్మం, కార్యదర్శి రాధాకృష్ణయ్య, కోశాధికారి మహంకాళి శ్రీనివాసరావు, గోపాల్‌రావు, చామర్తి రమేష్, మిరియాల మోహనరావు పాల్గొన్నారు.

గణిత అధ్యాపకుడు వేణుగోపాల్‌కు పీహెచ్‌డీ



గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరు నగరానికి చెందిన సీనియర్ గణితశాస్త్ర అధ్యాపకుడు పరిగె వేణుగోపాల్, ఏఎన్‌యూ ఎడ్యుకేషన్ విభాగం నుంచి పీహెచ్‌డీ అందుకున్నారు. 'ఎమోషనల్ ఇంటిలిజెన్స్ సెల్ఫ్ కాన్సెప్ట్ అండ్ అడ్జస్ట్‌మెంట్స్ ఇన్ రిలేషన్ టు అకడమిక్ అచీవ్‌మెంట్ ఆఫ్ ఇంటర్మీడియెట్ స్టడీస్' అనే అంశంపై ఆంధ్ర లూథరన్ బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్తేరు సునీల పర్యవేక్షణలో చేసిన పరిశోధనకు ఆయన పీహెచ్‌డీ పట్టా పొందారు. ఈసందర్భంగా శుక్రవారం డాక్టర్ ఎస్తేరు సునీలతో పాటు కళాశాల అధ్యాపకులు, విద్యావేత్తలు, కుటుంబ సభ్యులు పీవీ రాజేశ్వరి, ఎస్వీఆర్ ప్రసాద్, డాక్టర్ వేణుగోపాల్‌ను అభినందించారు.

కొవ్వొత్తుల ప్రదర్శన

గుంటూరు మెడికల్: ఇటీవల కోల్‌కతాలో వైద్యురాలిపై లైంగిక దాడిని నిరసిస్తూ శుక్రవారం డీఎంహెచ్ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో నిరసన ప్రదర్శన నిర్వహించారు. డాక్టర్ విజయలక్ష్మి మాట్లాడుతూ ఘటనకు కారణమైన నిందితులను ఉరితీయాలని, లేడీ డాక్టర్స్‌కు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. మహిళా వైద్యులు పని చేసే ప్రాంతంలో అన్ని రకాల జాగ్రత్తలు యాజమాన్యం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ అమర్తలూరి శ్రావణ్ బాబు, డాక్టర్ చుక్కా రత్నమన్మోహన్, డాక్టర్ ఈ.అన్నపూర్ణ పాల్గొన్నారు.

19న శ్రీచౌడేశ్వరి ఆలయ ప్రతిష్టా మహోత్సవం

నగరంపాలెం: నల్లపాడురోడ్డు సాయినగర్‌లోని మహాగణపతి కుమారస్వామిసహిత చౌడేశ్వర చంద్రశేఖర సమన్విత చక్రాలయంలో కళ్యాణ వెంకటేశ్వరస్వామి ప్రతిష్ఠ క్రతువు, కళ్యాణ మహోత్సవం నిర్వహిస్తోన్నట్లు ఆలయ సర్వాధికార ప్రతినిధి విశ్వంభరానందగిరి స్వామి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం నుంచి మూడు రోజులపాటు కల్యాణ వైభవ పూజలు జరుగుతాయని అన్నారు. శ్రీవశిష్ట హర రామ జన యజ్ఞ ఆశ్రమ పీఠాధిపతుడు ప్రణవానందగిరిస్వామి ఆశీస్సులు, ఆలయ శాశ్వత ధర్మకర్త కొమ్మన నరసింహారావు పర్యవేక్షణలో కార్యక్రమాలు జరగనున్నాయని ఆయన తెలిపారు.

బీసీ ఉద్యమం సంస్థ నగర కన్వీనర్‌గా సత్యనారాయణ

నెహ్రూనగర్: రాష్ట్రంలో అధిపత్య కులాల రాజకీయ పార్టీలతో సంబంధం లేకుండా ప్రత్యామ్నాయ రాజకీయ దృక్పథంతో ఏర్పాటైన స్వతంత్ర్య బీసీ ఉద్యమం సంస్థకు నగర కన్వీనర్‌గా సాదం సత్యనారాయణ ఎన్నికయ్యారు. ఈ మేరకు అరండల్‌పేటలో నగర కమిటీ ఎన్నిక నిర్వహించారు. నూతనంగా ఎన్నికైన సత్యనారాయణ మాట్లాడుతూ బీసీలు ఏకతాటిపై రావడానికి తగిన కార్యాచరణతో ఈ నెల 24వ తేదీన గుంటూరులో సమావేశం నిర్వహించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో బీసీ నాయకులు, హైకోర్టు న్యాయవాది వై.కోటేశ్వరరావుతో పాటు పీవీ రమణయ్య, కె.నాగేశ్వరరావు, సుబ్రహ్మణ్యం, రామారావు పాల్గొన్నారు.

ప్రమాదం అంచున ప్రయాణం



విద్యార్థులతో కిక్కిరిసిన ఆటో



వెనుక భాగంలో బ్యాగులతో పాటు విద్యార్థులు

- ఆటోలలో పరిమితికి మించి విద్యార్థుల తరలింపు
- పట్టించుకోని ఆర్టీఓ, ట్రాఫిక్ పోలీస్ అధికారులు
- కనీస పర్యవేక్షణ లేని దుస్థితి

పట్నంబజారు: జిల్లా వ్యాప్తంగా విద్యాసంస్థల బస్సులు తనిఖీ చేస్తున్న అధికారులు.. విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్న ఆటోలపై దృష్టి సారించటంలేదు. ఎన్నెన్నో విషాద ఘటనలు.. ఆటోవాలల తప్పిదాలు.. డబ్బుల కోసం దిబ్బిడి ముబ్బిడిగా.. విద్యార్థులను తరలిస్తున్న పరిస్థితుల కనిపిస్తున్నాయి. నిబంధనలకు పాతర వేసి.. ఇష్టానుసారంగా పసిమొగ్గల ప్రాణాలతో చెలగాట మాడుతున్నారు. నిత్యం విధులు నిర్వర్తించే ట్రాఫిక్ పోలీసులు.. అధిక లోడు ఎక్కిస్తే చర్యలు తీసుకోవాల్సిన ఆర్టీఓ అధికారులు చోద్యం చూస్తున్నారు. జిల్లాలో 32 వేల వరకు ఆటోలు ఉన్నాయి. గుంటూరు నగరంలోని 15 వేలకుపైగా ఆటోలు తిరుగుతున్నాయి. వాటిలో సుమారు మూడు వేల ఆటోలకు పైగా విద్యార్థులను పాఠశాలలు, కళాశాలలకు తీసుకుని వెళ్లి వస్తున్నారు. తల్లిదండ్రులు విద్యాసంస్థల ఫీజులు భరియించలేక, కొంత మంది పనుల నిమిత్తం, వివిధ కారణాల నేపథ్యంలో ఆటోల్లో వారి పిల్లలను పంపుతున్నారు. ఆటో సామర్థ్యన్ని బట్టి విద్యార్థులను ఎక్కించాల్సిన ఆటో డ్రైవర్లు, యజమానులు మాత్రం పరిమితికి మించి ప్రయాణం చేస్తున్నారు. నలుగురు నుంచి ఐదుగురిని ఎక్కించాల్సిన ఆటోవాలలు 10 మంది వరకు ముందు, వెనుక భాగాల్లో కూర్చొపెట్టి మరీ ప్రయాణం చేస్తున్నారు. పాఠశాల విద్యార్థులకు ఐతే ఐదో తరగతి లోగా రూ.2,000, 10వ తరగతి వరకు రూ.3,000, కళాశాల విద్యార్థులకు రూ.4 వేలకు పైగానే తీసుకుంటున్నారని తెలుస్తోంది.

ఆటోలూ చూడండీ..?

ఆటోవాలలు కేవలం ధనార్జనే ధ్యేయంగా వ్యవహరిస్తున్న తీరు భయాందోళనలకు గురి చేస్తోంది. నిత్యం విద్యాసంస్థల బస్సులపై దృష్టి సారించి కేసులు నమోదు చేస్తున్న ఆర్టీఓ అధికారులు, ఆటోల వైపు కనీసం కన్నెత్తి కూడా చూడటంలేదు. అప్పుడప్పుడు స్పెషల్ డ్రైవ్‌ల పేరుతో చేతులు దులుపుకుంటున్నారు. నిత్యం నగరంలో విధులు నిర్వర్తించే ట్రాఫిక్ పోలీసులు కళ్ల ముందే విద్యార్థులను పెద్ద ఎత్తున ఆటోల్లో తరలిస్తున్నా.. తమకేమి పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ఆటోలో ముందు వైపు పెద్దలనే ఎక్కించకూడదనే నిబంధనలు ఉన్నప్పటికీ.. చిన్నారులను ముందు, ఆటో వెనుక భాగాల్లో కూర్చొపెట్టి ప్రయాణం చేయటంతో ప్రమాదకరంగా మారుతోంది. ఏదైనా ఘటన జరిగితే తప్ప అధికారులు స్పందించరా..? అనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

తనిఖీలు చేపడతాం..



విద్యార్థులను పరిమితికి మించి తరలించే ఆటోలపై కేసులు నమోదు చేస్తాం. ఇప్పటికే ఆటో యూనియన్‌లు, డ్రైవర్‌లతో సమావేశం ఏర్పాటు చేసి హెచ్చరించాం. కచ్చితంగా ఆటోలు విద్యార్థుల తరలింపు అంశంలో ప్రత్యేక దృష్టి సారిస్తాం. నిబంధనలు అతిక్రమిస్తే చట్టప్రకారం కేసులు నమోదు చేయటంతో పాటు, ఆటోలను సీజ్ చేస్తాం. ఆటో డ్రైవర్‌లు, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యా సంస్థల నిర్వాహకులకు అవగాహన కల్పించేందుకు కృషి చేస్తాం.

–షేక్ కరీం
(డీటీసీ, గుంటూరు జిల్లా)

భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతం



గంటాలమ్మ చెట్టు వీధిలో శ్రీకన్యకాపరమేశ్వరి దేవి పూల అలంకరణ

శ్రావణ మాసం రెండో శుక్రవారం వరలక్ష్మీవ్రతాన్ని మహిళలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయానే వివిధ ఆలయాల్లో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. పెద్దసంఖ్యలో భక్తులు హాజరై పూజలు చేశారు. అమ్మవారిని దర్శించుకున్నారు.

–సాక్షి ఫొటోగ్రాఫర్, గుంటూరు



వరలక్ష్మీ వ్రతం చేస్తున్న మహిళలు



బృందావన్ గార్డెన్స్ పూల అలంకరణలో అమ్మవారు..



బృందావన్ గార్డెన్స్‌లో వ్రతం చేస్తున్న మహిళలు



అరండల్‌పేట శ్రీఅష్టలక్ష్మి ఆలయంలో పూజలు

సిలంబం స్టేట్ చాంపియన్‌షిప్‌లో సత్తా



విద్యార్థులతో విష్ణువర్ధన్, సుబ్బారావు

గుంటూరు ఎడ్యుకేషన్: ఇండియన్ సిలంబం ఫెడరేషన్ ఆఫ్ చెన్నై నిర్వహించిన సిలంబం స్టేట్ చాంపియన్‌షిప్‌లో శ్రీపాటిబండ్ల సీతారామయ్య సీబీఎస్‌ఈ పాఠశాల విద్యార్థులు ప్రథమ బహుమతి కైవసం చేసుకున్నట్లు పాఠశాల కరస్పాండెంట్ పాటిబండ్ల విష్ణువర్ధన్ తెలిపారు. లక్ష్మీపురం మెయిన్‌రోడ్డులోని పాఠశాలలో శుక్రవారం విద్యార్థులను అభినందించి పతకాలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఈనెల 11న గుంటూరులోని బీఆర్ స్టేడియంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి చాంపియన్‌షిప్‌లో పాల్గొన్న తమ విద్యార్థులు సింగిల్ స్టిక్‌లో ప్రథమ బహుమతి పొందారని వివరించారు. ఈసందర్భంగా పాఠశాల కమిటీ ఉపాధ్యక్షుడు సూర్యదేవర హనుమంతరావు, పూర్వ విద్యార్థి పి.సుబ్బారావు విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేసి, కోచ్ వి.రామకృష్ణను అభినందించారు. కార్యక్రమంలో పాలకవర్గ సభ్యుడు గింజుపల్లి వరప్రసాదరావు, అకడమిక్ డైరెక్టర్ లేళ్ల కృష్ణవేణి, ప్రిన్సిపాల్ జంపని పద్మజ పాల్గొన్నారు.

సర్దార్ గౌతు లచ్చన్న ఫ్లెక్సీ చించివేత



చుట్టుగుంట సెంటర్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న నాగగౌడ్ తదితరులు

నెహ్రూనగర్: స్వాతంత్ర్య సమరయోధుడు డాక్టర్ సర్దార్ గౌతు లచ్చన్న జయంతిని పురస్కరింకుని గౌడ జాతి ఐక్యవేదిక వ్యవస్థాపక అధ్యక్షులు దొంత నాగగౌడ్ చుట్టుగుంట సెంటర్‌లో గౌతు లచ్చన్న ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. గురువారం రాత్రి గుర్తు తెలియని ఫ్లెక్సీని చించివేయడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం చుట్టుగుంట సెంటర్‌లో గౌతు లచ్చన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ పక్కనే టీడీపీ నేతలకు సంబంధించి ఫ్లెక్సీలు గత కొద్ది రోజుల తరబడి ఉన్నప్పటికి వాటికి ఏమి కాకుండా గురువారం ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు చించివేయడం సమంజసం కాదన్నారు. కావాలనే టీడీపీ శ్రేణులు గౌడ జాతిని అవమానించేందుకు ఫ్లెక్సీ చింపివేశారని ఆరోపించారు.

ఉద్యోగుల సమస్య పరిష్కారానికి కృషి

ఏపీజీఈఏ గుంటూరు జిల్లా అధ్యక్షుడు చాంద్ బాషా



మాట్లాడుతున్న చాంద్‌బాషా

గుంటూరు మెడిల్: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం గుంటూరు జిల్లా సమావేశం శుక్రవారం గుంటూరు వైద్య కళాశాలలోని కార్యాలయంలో నిర్వహించారు. సంఘం గుర్తింపు పొంది నేటికి 5 సంవత్సరాలు అయిన సందర్భంగా కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. జిల్లా అధ్యక్షుడు చాంద్ బాషా మాట్లాడుతూ జిల్లాలో తన దృష్టికి వచ్చిన ప్రతి ఉద్యోగి సమస్యను జిల్లా అధికారుల దృష్టికి తీసుకొని వెళ్లి పరిష్కరించనున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలో ఏ సంఘం నిర్వహించలేని జిల్లా కౌన్సిల్ సమావేశాలను ఏర్పాటు చేసి ఉద్యోగుల్లో చైతన్యం నింపామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి కరీముల్లా షాఖాదరి, జిల్లా కోశాధికారి పోతురాజు, నగర శాఖ అధ్యక్షుడు నాగేశ్వరరావు, నగర శాఖ ఉపాధ్యక్షులు రాధాకృష్ణ, పెదరత్తయ్య, నాగూర్ వలి, నగర శాఖ కోశాధికారి శ్రీనివాస్, తాడికొండ తాలూకా యూనిట్ అధ్యక్షుడు సుబ్బారావు, మహిళా విభాగం సంఘం నాయకులు షబానా సుల్తానా పాల్గొన్నారు.

విజయవంతంగా గూడ ఆపరేషన్

గుంటూరు మెడిల్: గూడ జారి విపరీతంగా నొప్పి వస్తున్న రోగికి గుంటూరు జీజీహెచ్ ఆర్థోపెడిక్ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ వి.వి.నారాయణరావు నేతృత్వంలో క్లిష్టమైన ఆపరేషన్ విజయవంతం చేశారని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ చెప్పారు. శుక్రవారం ఆసుపత్రికి తండ్రితో కలసి వచ్చిన రోగి డాక్టర్ సూపరింటెండెంట్ కిరణ్ కుమార్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

సమ్మె నేపథ్యంలో ప్రత్యేక ఏర్పాట్లు

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్ జూనియర్ డాక్టర్లు సమ్మె చేస్తున్నా రోగులకు ఇబ్బందులు లేకుండా ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్ చెప్పారు. జూడాలు సమ్మె చేస్తున్న నేపథ్యంలో శుక్రవారం అత్యవసర చికిత్స విభాగాన్ని పరిశీలించారు. పలు వార్డులను తనిఖీ చేశారు. రోగుల వైద్య సేవలకు ఎలాంటి అంతరాయం కలగకుండా సీనియర్ వైద్యులను నియమించామన్నారు. సీనియర్ వైద్యులను ఓపీలో కొనసాగే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. అత్యవసర సేవలు యథాతథంగా కొనసాగుతున్నాయని, సీనియర్ వైద్యులు, ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, ఆర్ఎంఓ అందుబాటులో ఉంటారన్నారు. జీజీహెచ్‌లో పని చేసేందుకు వైద్యులను పంపించాల్సిందిగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారికి లేఖను పంపించగా పది మంది వైద్యులను పంపించారన్నారు. గుంటూరు మెడికల్ కళాశాల నుంచి మరో 60 మంది వైద్యులు పని చేసేందుకు వచ్చినట్లు వివరించారు. సేవలందిస్తున్న వైద్యులకు రక్షణ కల్పించేందుకు పోలీస్ ఉన్నతాధికారులకు లేఖ రాశామన్నారు. పెట్రోలింగ్ వ్యవస్థను కూడా ఏర్పాటు చేయాల్సిందిగా కోరినట్లు తెలిపారు.

వైద్యసిబ్బందికి ప్రత్యేక చట్టాలు అవసరం

గుంటూరు మెడికల్: వైద్య సిబ్బంది రక్షణకు ప్రత్యేక చట్టాలు అవసరమని ఆంధ్రప్రదేశ్ నర్సస్ స్ట్రగుల్ కమిటీ రాష్ట్ర కోఆర్డినేటర్ స్వచ్ఛంద ప్రసాద్ పేర్కొన్నారు. శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈనెల 9న కోల్‌కతాలో వైద్య విద్యార్థినిపై లైంగిక దాడి, హత్య ఘటనను ఖండిస్తున్నామన్నారు. దేశవ్యాప్తంగా వైద్యుల నిరసన నేపథ్యంలో దుర్మార్గపు ఘటనకు పాల్పడిన దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం కఠిన చర్య తీసుకోవాలని కోరుతూ ఈనెల 17, 18, 19 తేదీల్లో మూడు రోజులపాటు నల్ల రిబ్బన్లతో విధులకు హాజరవుతామన్నారు.

అనుమతి లేని బ్యానర్లు తొలగించాలి

నెహ్రూనగర్: నగరంలో అనుమతి లేని బ్యానర్లు, ఫుట్‌పాత్‌లపై ఆక్రమణలు వెంటనే తొలగించాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు టౌన్ ప్లానింగ్ సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. శుక్రవారం సాయంత్రం నగరపాలక పాలక సంస్థ కమిషనర్ కార్యాలయంలో పట్టణ ప్రణాళిక బలం బృంద సభ్యులతో ప్రత్యేక సమావేశం అయ్యారు. వారం రోజుల్లో అనుమతులు లేని బ్యానర్లు, ఫుట్‌పాత్‌లపై ఆక్రమణలు తొలగించాలని కోరారు.

విద్యుత్ ప్రమాదాలపై అవగాహన ఉండాలి

గుంటూరు ఈస్ట్: విద్యుత్ ప్రమాదాలపై అవగాహన కలిగిఉండాలని విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ కరుణాకర్‌రావు శుక్రవారం చెప్పారు. విద్యుత్ సమస్యల పరిష్కారానికి టోల్ ఫ్రీ 1912 నంబరును సంప్రదించాలన్నారు.

సీపీఐ 57వ డివిజన్ సమావేశం

లక్ష్మీపురం: సీపీఐ వార్షికోత్సవాన్ని జయప్రదం చేయాలని జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ కోరారు. గడ్డిపాడులో 57 వ డివిజన్ సీపీఐ శాఖ సమావేశం చల్లా దాసు అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు.

అన్న క్యాంటీన్లు ప్రారంభం



అన్న క్యాంటీన్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి

నెహ్రూనగర్: ప్రతి పేదవానికి నాణ్యమైన ఆహారం నామమాత్రపు ధరకే అన్న క్యాంటీన్లలో లభిస్తుందని, మరింత మంది ఆకలి తీర్చడానికి దాతలు ముందుకు రావాలని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి కోరారు. శుక్రవారం గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలోని పల్నాడు బస్టాండ్ వద్ద అన్న క్యాంటీన్‌ను నగర కమిషనర్ పులి శ్రీనివాసులు, ఎమ్మెల్యే గళ్లా మాధవిలతో కలిసి కలెక్టర్ పునః ప్రారంభించారు. అనంతరం కమిషనర్ తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే నసీర్ అహ్మద్‌తో కలసి నల్లచెరువు మెయిన్ రోడ్‌లోని క్యాంటీన్‌ను, ప్రత్తిపాడు ఎమ్మెల్యే బి.రామాంజనేయులు, తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్‌లతో కలిసి ఆర్టీఓ కార్యాలయం, ఐడీ హాస్పిటల్ వద్ద క్యాంటీన్లను పునః ప్రారంభించారు. కార్యక్రమంలో డెప్యూటీ మేయర్ షేక్ సజీల, డెప్యూటీ కమిషనర్లు సిహెచ్.శ్రీనివాస్, టి.వెంకట కృష్ణయ్య, ఎస్ఈ శ్యాం సుందర్, ఎంహెచ్ఓ మధుసూదన్, ఈఈలు సుందర్రామిరెడ్డి, కొండారెడ్డి, కోటేశ్వరరావు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ హయాంలో చేసిన అభివృద్ధిని వివరించాలి

మాజీ ఎమ్మెల్యే ముస్తఫా



కార్పొరేటర్లతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ముస్తఫా

పట్నంబజారు: మున్సిపల్ కార్పొరేషన్ కౌన్సిల్ సమావేశంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం హయాంలో చేసిన అభివృద్ధిని వివరించాలని తూర్పు మాజీ ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా సూచించారు. మంగళదాస్‌నగర్‌లోని ఆయన కార్యాలయంలో శుక్రవారం వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లతో సమావేశం నిర్వహించారు. ముస్తఫా మాట్లాడుతూ కౌన్సిల్‌లో రావాల్సిన బిల్లులు, జరగాల్సిన అభివృద్ధిపై వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లు పోరాడేందుకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా 90కు పైగా స్థానిక సంస్థలు, కార్పొరేషన్లు, వైఎస్సార్ సీపీ నాయకత్వంలోనే ఉన్నాయని, ఈ సమయంలో బలంగా ఉంటే రానున్న రోజుల్లో పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా ముందుకు సాగవచ్చన్నారు. 2029 ఎన్నికల నాటికి గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు పటాన్ రిహానా, మల్లవరపు రమ్య, ఆబిద్‌బాషా, పాపతోటి అంబేడ్కర్, మెహమూద్, సంకూరి శ్రీను, రామనబోయిన అజయ్‌యాదవ్, ధూపాటి వంశీ, వైఎస్సార్‌సీపీ నేతలు అగ్గిపెట్టి రాజు, యిర్రి సాయి, మర్రి సత్యం పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాల సమస్యకు ప్రాధాన్యం ఇవ్వాలి

సీపీఎం నాయకులు బాబూరావు



మాట్లాడుతున్న బాబూరావు

లక్ష్మీపురం: ప్రభుత్వం నిర్వహించనున్న రెవెన్యూ సదస్సుల్లో ఇళ్ల స్థలాలు, ఇళ్ల పట్టాల సమస్యలకు ప్రాధాన్య ఇవ్వాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు సి.హెచ్.బాబూరావు కోరారు. స్థానిక బ్రాడీపేటలోని పార్టీ జిల్లా కార్యాలయంలో పార్టీ జిల్లా కమిటీ విస్తృత సమావేశం శుక్రవారం నిర్వహించారు. సమావేశానికి జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఇ.అప్పారావు అధ్యక్షతన వహించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో మంగళగిరి నియోజకవర్గంతో పాటు జిల్లా వ్యాపితంగా సుమారు లక్ష కుటుంబాలు దీర్ఘకాలంగా ప్రభుత్వ భూముల్లో ఇళ్లు వేసుకుని నివాసముంటున్నారని తెలిపారు. వారికి ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని, అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు, ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు కేటాయించాలని కోరారు. రాష్ట్ర వ్యాపితంగా స్కీంవర్కర్స్, పారిశుద్ధ్య కార్మికులు, ఇతర చిరుద్యోగులు పాలక పార్టీ వేధింపులకు గురవుతున్నారని చెప్పారు. ఈ పద్ధతులు మానుకోకపోతే ఆందోళనకు పూనుకుంటామని హెచ్చరించారు. రాజధాని నిర్మాణానికి నిధులు కేటాయించి అభివృద్ధికి ప్రణాళిక రూపొందించాలని కోరారు. జిల్లా కార్యదర్శి పాశం రామారావు మాట్లాడుతూ కౌలు రైతులకు యజమాని సంతకంతో నిమిత్తం లేకుండా గుర్తింపు కార్డులిచ్చి పంట రుణాలు మంజూరు చేయాలని కోరారు. గుంటూరు చానల్‌ను పర్చూరు వరకు పొడిగించేందుకు నిధులు కేటాయించి తక్షణమే పనులు ప్రారంభించాలని విన్నవించారు. పెదవడ్లపూడి హైలెవల్ చానల్‌ను పూర్తి చేయాలని, పంట కాల్వలు కొండవీటి వాగు, గుంటూరు చానల్, నల్లమడ వాగులలో పేరుకుపోయిన తూటుకాడ, గుర్రపు డెక్క తొలిగించాలని, కాల్వల ఆధునికీకరణ కోసం నిధులు కేటాయించాలని, అస్తవ్యస్తంగా ఉన్న డ్రైనేజీ వ్యవస్థలను మెరుగుపర్చాలని సమావేశం తీర్మానించిందన్నారు. సమావేశంలో సీపీఎం జిల్లా నాయకులు వై.నేతాజీ, ఎస్. భావన్నారాయణ, కె.నళీనికాంత్, ఎం.రవి, ఎస్.చెంగయ్య, బి.వెంకటేశ్వరరావు, డి.వెంకటరెడ్డి, బి.కోటేశ్వరి పాల్గొన్నారు.

భారతమాత వైభవమే బీజేపీ లక్ష్యం

గుంటూరు మెడికల్: బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఈదర శ్రీనివాస రెడ్డి సారథ్యంలో వారం రోజులుగా నిర్వహిస్తున్న కార్యక్రమాలు శుక్రవారం దివంగత అటల్ బిహారీ వాజ్‌పేయి వర్ధంతితో ముగిశాయి. ఈసందర్భంగా టీజేపీఎస్ కళాశాల పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద నుంచి పట్టాభిపురం స్వామి వివేకానంద సెంటర్ మీదుగా పాదయాత్ర నిర్వహించారు. బంగ్లాదేశ్‌లో ప్రాణాలు కోల్పోయిన వారికి ఆత్మశాంతి కలగాలని నివాళులర్పించారు. స్థానిక కార్పొరేటర్ వరప్రసాద్, మాజీ కార్పొరేటర్ మాగంటి సుధాకర్, బీజేపీ, జనసేన నేతలు పాకనాటి రమాదేవి, మకుటం శివ, పాలపాటి రవికుమార్, కొక్కెర శ్రీనివాస్ యాదవ్, వెంకటేశ్వర విద్యాసంస్థల చైర్మన్ గుదిబండి సాంబిరెడ్డి, బండారుపల్లి రోశయ్య, మర్రి శంకరరావు, వెలగలేటి గంగాధర్, బొలగాని సాంబయ్య, బొల్లాప్రగడ శ్రీదేవి, జెట్టిబాబు, కపిలవాయి బదరీనారాయణ, సరస్వతినంది, పోకూరి జితేంద్ర, ముత్యం నరేంద్ర, అంకాల శ్రీనివాసరావు, చాపల రంగారావు, తాడువాయి రామకృష్ణ పాల్గొన్నారు.

మాజీ ప్రధాని వాజ్‌పేయికి ఘన నివాళి

మాజీ ప్రధాని ఆటల్ బిహారీ వాజ్‌పేయి ఆరో వర్ధంతి సందర్భంగా గుంటూరులోని బీజేపీ జిల్లా కార్యాలయంలో ఆయన చిత్ర పటానికి పూలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఉపాధ్యక్షుడు పెరుమాళ్ళ అనంతపద్మనాభం సభాధ్యక్షత వహించారు. కార్యక్రమంలో జిల్లా సంయోజక్ భీమినేని చంద్ర శేఖర్, జిల్లా ప్రధాన కార్యదర్శి చరక కుమార్ గౌడ్, చెరుకూరి తిరుపతిరావు, ఆవుల రాము, షేక్ సాంబశివరావు, కారంశెట్టి రమేష్, యారవ శ్రీను, నాగమల్లీశ్వరి, అజయ్ పాల్గొన్నారు.

సామాజిక భద్రత కల్పించే అతిపెద్ద సంస్థ..

నగరంపాలెం: ప్రపంచంలో అతిపెద్ద సామాజిక భద్రత కల్పించే సంస్థ అయినా ఉద్యోగుల భవిష్యనిధి సంస్థ అందించే పథకాలను సభ్యులు వినియోగించుకోవాలని ఉద్యోగుల ప్రాంతీయ భవిష్యనిధి కమిషనర్ రాజేశ్వర్‌రాజేష్ అన్నారు. బృందావనగార్డెన్స్ శ్రీవెంకటేశ్వరస్వామి దేవాలయం అన్నమయ్య కళావేదికపై శుక్రవారం జీవన్ ప్రమాన్ అవగాహన సదస్సు, విజిలెన్స్ అవగాహన సదస్సు(2024) జరిగింది. ఆయన మాట్లాడుతూ సాంకేతికను అందుబాటులోకి తీసుకొస్తున్నామని అన్నారు. సహాయక పీఎఫ్ కమిషనర్ జీఆర్‌జేఆర్ మాధవశంకర్, దేవస్థానం కమిటీ అధ్యక్షులు సి.హెచ్.మస్తానయ్య ప్రసంగించారు. అనంతరం ఉద్యోగులు, కుటుంబ సభ్యులు సాంస్కృతిక కదంబం పేరుతో శాస్త్రీయ సంగీత, వీణ కచేరిలు, భక్తి గీతాలాపన, కూచిపూడి నృత్య ప్రదర్శనలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎం.రామశేషన్, డి.సాయిఆనంద్ కుమార్, అనూష, కె.సుధాకరరావు, ఎం.కృష్ణార్జున్ పాల్గొనగా, పి.కుమార్‌శేఖర్ వ్యాఖ్యాతగా రిక్రియేషన్ క్లబ్ ప్రధాన కార్యదర్శి ఎం.రమేష్‌బాబు కార్యక్రమాలను పర్యవేక్షించారు.